

1 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే1 నుంచి 31వరకు ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్ రెడ్డి, వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 12ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. జిల్లాకేంద్రంలోని జీజీ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 8106060600 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



కీచక గురువులు!

- లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉపాధ్యాయులు
- పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్న బాలికలు
- పోక్సో కేసులు నమోదవుతున్నా మారని టీచర్ల తీరు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు దారితప్పుతున్నారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తికే చెడ్డపేరును తీసుకొస్తున్నారు. కొంత మంది ఉపాధ్యాయులు చేస్తున్న ఈ పనికి ఉపాధ్యాయుల లోకానికే చెడ్డపేరు వస్తోంది. విద్యార్థులు ఇంటిలో కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం కేటాయిస్తూ చదువును నేర్చుకునే క్రమంలో కొంతమంది లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారిపై పోక్సో కేసు నమోదైంది. అయినప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు ఇంకా వేధింపులను ఆపకపోవడం గమనార్హం. ఉపాధ్యాయుల లైంగిక వేధింపుల ఘటనలు అక్కడక్కడ బహిర్గతం అవుతున్నా చాలామట్టుకు పాఠశాల స్థాయిలోనే బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడుతున్నారు. జిల్లాలోని అనేక చోట్ల బాలికల పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు గతంలో జరిగాయి. ఈ విషయంలో బాలికలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు బయపడుతున్నారు. గతంలో నిజామాబాద్ నగరంలోని మోడ్రన్ పబ్లిక్ స్కూల్‌లో అదేవిధంగా నందిపేట మండలంలోని ఓ పాఠశాలలో ఇంకా అనేక చోట్ల లైంగిక వేధింపుల ఘటనలు జరిగాయి. లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేస్తున్నా కీచక గురువులలో మాత్రం ఏమార్పు రావడం లేదు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో ఓ పీఈటీపై ఇటీవల పోక్సో కేసు నమోదైంది. అదే విధంగా బిక్కనూరు మండలంలోని ఓ ఉపాధ్యాయుడిపై ఆరోపణలు రాగా పాఠశాల స్థాయిలోనే సెటిల్‌మెంట్ చేసినట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ఉపాధ్యాయులు ప్రవర్తిస్తున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నా ఉపాధ్యాయుల పట్ల ఉన్న భయం కారణంగా బాలికలు వారిపై ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్నారు. కొంతమంది బాలికలు ఉపాధ్యాయుల లైంగిక వేధింపుల వల్ల చదువులు మధ్యలోనే మానేసిన ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. పోక్సో కేసులు నమోదవుతున్నా, సస్పెండ్ చేస్తున్నప్పటికీ లైగింక వేధింపులు మాత్రం ఆగడం లేదు.

గ్రామీణ ప్రాంతాల్లో అధికం

ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేద మధ్య తరగతి విద్యార్థులే వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఉన్నత చదువులు చదవడం చాలా అరుదుగా ఉంటుంది. పదవ తరగతి వరకు స్థానికంగా ఉండే పాఠశాలల్లోనే బాలికలను చదివించాలని తల్లిదండ్రులు (తరువాయి 8వ పేజీలో..)



ఆమ్‌చూర్‌కు గిట్టుబాటు కరువు!

- మార్కెట్‌కు వస్తున్న ఆమ్‌చూర్
- గిట్టుబాటు ధర లేదంటూ రైతుల ఆవేదన
- గత ఏడాది లాగే ధర వచ్చేలా చర్యలు చేపట్టాలంటున్న రైతులు



నిజామాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి మార్కెట్‌కు ఆమ్‌చూర్ తీసుకువచ్చినా రైతులకు గిట్టుబాటు కావడం లేదు. గత సంవత్సరం లాగా ధర రావడం లేదు. ఈ యేడు మామిడి దిగుబడి భారీగా తగ్గిన ఆమ్‌చూర్‌కు మాత్రం ధర పెరగడం లేదు. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల్లో చింతపండుకు బదులుగా ఆమ్ చూర్‌ను వంటల్లో ఉపయోగిస్తారు. ఆమ్‌చూర్‌ను పౌడర్‌గా మార్చి కూరల్లో వినియోగిస్తారు. చింతపండు లాగానే డిమాండ్ ఉన్నా రైతులకు మాత్రం ధర రావడం లేదు. గత సంవత్సరంతో పోలిస్తే క్వింటాలుకు 10వేల వరకు ధర తక్కువగా వస్తోంది. తెలంగాణలో నిజామాబాద్‌లోని ఎక్కువగా ఈ ఆమ్‌చూర్‌ను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. మార్కెట్‌కు వస్తున్న ఆమ్‌చూర్‌కు ధర పెరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

20 ఏళ్లుగా మార్కెట్‌కు ఆమ్‌చూర్

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఆమ్‌చూర్ గత వారం రోజులుగా వస్తోంది. మామిడి సాగు చేసే రైతులు ధర తగ్గినప్పుడు కాయల నుంచి ఆమ్‌చూర్‌ను తయారు చేస్తారు. ముక్కలుగా చేసి ఎండబెట్టి ఈ ఆమ్‌చూర్‌ను మార్కెట్‌కు తీసుకువస్తారు. మార్కెట్‌లో ప్రతి సంవత్సరం అమ్మకాలు చేస్తారు. పచ్చి మామిడిని అమ్మినదానికంటే ఆమ్‌చూర్‌కు కొంత ఎక్కువ ధర వస్తుందనే నమ్మకంతో ప్రతీ సంవత్సరం మామిడి రైతులు ఆమ్‌చూర్‌ను తీసుకువస్తారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన రైతులు తీసుకువచ్చి ఈ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తారు. ఆమ్‌చూర్ కొనుగోలు ఎక్కువగా ఈ మార్కెట్‌లోనే గత 20 ఏళ్లుగా వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో ఇక్కడికి తీసుకువచ్చి అమ్మకాలను చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం దాదాపు 5వేల క్వింటాళ్ల వరకు ఈ ఆమ్‌చూర్ క్రయవిక్రయాలు మార్కెట్‌లో కొనసాగుతాయి. నెల రోజుల పాటు రైతులు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తారు. ఏప్రిల్, మే నెలల్లోనే ఎక్కువగా ఈ ఆమ్‌చూర్ మార్కెట్‌కు వస్తుంది. ప్రతిరోజు వంద క్వింటాళ్ల నుంచి రెండు వందల క్వింటాళ్ల వరకు క్రయవిక్రయాలు జరుగుతాయి. మార్కెట్‌కు వచ్చే ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేసేందుకు సుమారు పది మంది వరకు వ్యాపారులు ఉన్నారు. వీరే ప్రతీ సంవత్సరం ఈ ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేస్తారు. గత సంవత్సరం ఆమ్‌చూర్‌కు క్వింటాలు 30వేల నుంచి 36వేల మధ్య అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 10వేల నుంచి 24వేల మధ్యన క్వింటాలు ఆమ్‌చూర్ అమ్మకాలు జరుగుతున్నాయి. సరాసరి సగటున క్వింటాలు 16వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఆమ్‌చూర్ డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ధరలు పెడుతున్నారు. కొంత మంది వ్యాపారులే ఉండటం వల్ల ధరలు కూడా ఎక్కువగా రావడం లేదు. వ్యాపారులు రింగ్ కావడంతో వారు చెప్పిందే ధరగా మారుతుంది. తాము గాలివానలను తట్టుకొని మామిడిని పండిస్తున్నామని ఆమ్‌చూర్‌కు ధర వస్తే తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు పట్టించుకొని గత సంవత్సరం లాగానే ఆమ్‌చూర్‌కు ధర వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

డిమాండ్ ఉన్నా ధరలేదు

- గురు, రైతు, అవేల్ ఘన్‌పూర్



ఈయేడు మామిడి దిగుబడి లేదు. డిమాండ్ ఉన్నా ధర లేదు. మార్కెట్‌కు రెండు క్వింటాళ్ల వరకు ఆమ్‌చూర్ తెచ్చాను. ధర మాత్రం పెరగడం లేదు. గత ఏడాది క్వింటాకు 35వేల వరకు వచ్చేది. ఈ సంవత్సరం 24వేలు వరకే ధర పెడుతున్నారు. సరాసరి 16వేల నుంచి 20వేల మధ్యనే కొనుగోలు చేస్తున్నారు. రైతుకు గిట్టుబాటు అయ్యేవిధంగా కొనుగోలు చేయాలి.

కష్టపడినా ఫలితం లేదు

- బుచ్చన్న, రైతు, ఇందల్వాయి



మామిడి పంట కోసం కష్టపడిన ఫలితం ఉండటం లేదు. పచ్చి కాయను అమ్మితే ధర తక్కువ వస్తుంది. ఆమ్‌చూర్ వల్ల లాభం వస్తుందని అనుకున్నాం. కానీ మార్కెట్‌లో అలా లేదు.



హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న జిల్లా నాయకులు

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ కార్యక్రమంలో శనివారం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, గంగారెడ్డిలు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు. శనివారం జరిగిన సమ్మిట్‌కు అగ్రనాయకులు రాహుల్‌గాంధీ హాజరయ్యారు.

భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయిస్తాం

- ఏటా భూ రికార్డుల ఆధునికీకరణ
- జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నందిపేట్, ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆధార్ మాదిరిగానే భూకమతాలకు భూదార్ నంబర్లు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. శనివారం నందిపేట, ఆర్మూర్ లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్ ఓఆర్) నూతన చట్టం ద్వారా భూవివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం భూదార్ నెంబర్లను కేటాయిస్తోందన్నారు. ఇప్పటివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తు భూభారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. భూదార్ నెంబర్ కేటాయింపు వల్ల భూఆక్రమణలకు, వివాదాలకు అవకాశం ఉండదని రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు భరోసా లభిస్తుందన్నారు. నిర్దిష్ట గడువులోపు భూసమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈచట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు. భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు దరణిలో అవకాశం ఉండేదికాదని ప్రస్తుతం తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసు లుబాటు ఉందన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తామన్నారు. మే, జూన్ నెలలో అధికారులు గ్రామాల వారిగా రెవెన్యూ సద స్సు నిర్వహించి భూసమస్యలున్న రైతుల నుంచి ఆర్జీలు స్వీకరిస్తారన్నారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అట్టి ఆర్జీలను రెండు నెలల వ్యవధిలో పరిష్కరస్తారని తెలిపారు. గతంలో ధరణి వల్ల భూవివాదాల పరిష్కారానికి సివిల్ కోర్టుల చుట్టు తిరిగేవారని భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవ స్థ, రెవెన్యూ కోర్టుల వల్ల చాలావరకు భూసమస్యలు తహసీల్దార్ ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారం అవుతాయన్నా రు. భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా పట్టదారు పాస్‌పుస్తకాల్లో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొని భూమికి సంబంధించిన మ్యాప్ పొందుపరుస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ చట్టంలో నివాస స్థలాలు, గ్రామకంఠం, ఆబాది స్థలాలు, వ్యవసాయేతర భూములను కూడా పొందుపరుస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 9లక్షల సాదాబైనామా దరఖాస్తులకు భూభారతిచట్టం ద్వారా క్రమబద్దీకరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 31న రికార్డుల ఆధునీకరణ చేస్తార ని భూసమస్యలున్న రైతులు భూభారతి చట్టాన్ని సద్విని యోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమ ంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్, తహసీల్దార్లు, పీఏసీఎస్ ఛైర్మన్లు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నందిపేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



ఆర్మూర్‌లో సదస్సుకు హాజరైన రైతులు



ఆర్మూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

జిల్లాను ముంచెత్తిన అకాలవర్షం

- పలుచోట్ల తడిసిన ధాన్యం

నిజామాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పలు మండలాల పరిధిలో శనివారం రాత్రి అకాల వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, గాలిదుమారంతో మొదలైన వర్షం పడడంతో పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. జిల్లాలోని మెజారిటీ గ్రామాల పరిధిలో వరి పొలాలను కోసిన రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు రోడ్లవెంట, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసి ఉంచారు. రాత్రి సమయంలో ఒకేసారి వర్షం పడడం వల్ల ధాన్యం తడిచిపోయింది. జిల్లాలో ఉరుము, మెరుపు, గాలిదుమారంతో వర్షం పడడం వల్ల పలుచోట్ల కరెంట్ కూడా నిలిచిపోయింది. రాత్రి సమయంలో కొన్ని మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం పడింది.

జిల్లాలో 45 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతల నమోదు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వరుసగా నాల్గవ రోజు జిల్లాలో 45 డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. శనివారం మెండోరాలో 45.3, వేల్పూర్‌లో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వేంపల్లిలో 44.9, నిజామాబాద్‌లో 44.9, పెర్కిట్‌లో 44.7, సీహెచ్ కొండూర్‌లో 44.6, మచ్చర్లలో 44.6, ఏర్గట్లలో 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. గత మూడురోజులతో పోలిస్తే జిల్లాలో కొంతమేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గాయి. శుక్రవారం సాయంత్రం మేఘావృతం కావడంతో శనివారం ఉదయం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత తగ్గింది. గత మూడు నాలుగు రోజులతో పోలిస్తే జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి.

జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్‌కు పదోన్నతి

నిజామాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న వాజీద్ హుస్సేన్‌కు డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్‌గా పదోన్నతి కల్పించారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులను జారీచేశారు. ఆయనను ఇక్కడే ఇన్‌చార్జి జేడీఏగా కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఆయన వ్యవసాయ శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. దీర్ఘకాలికంగా అనుభవం ఉన్న ఆయనను కొనసాగే విధంగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఏడీఏలకు డీడీఏలుగా పదోన్నతులు కల్పించారు.

నేడు బీఆర్ఎస్ చలో వరంగల్ సభ

- నగరమంతా గులాబీమయం
- సభకు తరలివెళ్లనున్న బీఆర్ఎస్ నాయకులు
- వందలాది ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లా నుంచి 50 వేలకు పైగా తరలనున్న బీఆర్ఎస్ శ్రేణులు



కోర్టు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గులాబీ జెండాలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు జిల్లా నుంచి వేలాది మంది నాయ కులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. ఆదివారం ఉదయం నుంచే జిల్లా నుంచి వివిధ నియోజకవర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు సభకు తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు వరంగల్ సభకు హాజర య్యేందుకు ప్రయత్నాలు చేసుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలతోపాటు సొంత వాహనాల్లో సభకు తరలివెళ్లేందుకు సిద్ధం చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలను తరలిం చేందుకు గ్రామాలు, మండలాల వారిగా వార్డులవారిగా జాబితాను సిద్ధం చేసుకుని ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీలకు అంద జేశారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవ ర్గాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఇప్పటికే సన్నాహక సమావేశాలు పూర్తిచేసి సభకు వెళ్లేందుకు పూర్తిగా సంసిద్ధమయ్యారు. సుమారు 2400 వాహ నాల్లో సభకు తరలేందుకు ఏర్పాట్లను పూర్తిచేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ తోపాటు మిగతా ఇన్‌చార్జీలు వరంగల్ సభకు తరలిచేందుకు సన్నా హాలు పూర్తిచేశారు.

సభకు తరలనున్న 250 ఆర్టీసీ బస్సులు

వరంగల్‌లోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు నిజామాబాద్ రీజియన్ నుంచి సు మారు 250 ఆర్టీసీ బస్సులు తరలివెళ్లనున్నాయి. ఇప్పటికే 250 ఆర్టీసీ బస్సులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు అద్దెకు తీసుకున్నారు. నిజామా బాద్ రీజియన్‌లోని ఆర్మూర్ డిపోనుంచి 46బస్సులు, బోధన్ డిపో నుంచి 46బస్సులు, నిజామాబాద్ డిపో-1 నుంచి 51 బస్సులు, నిజామాబాద్ డిపో-2 నుంచి 7బస్సులు, బాన్సువాడ డిపో నుంచి 34బస్సులు, కామారెడ్డి నుంచి -66బస్సులు మొత్తంగా 250 బస్సులు సభకు తరలి వెళ్లనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 550కిపైగా ఉన్న ఆర్టీసీ బస్సులు సగానికి పైగా వరంగల్ సభకు తరలివెళ్లనుండడంతో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేట్లులేదు.

నగరమంతా గులాబీమయం

బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకొని నగరమంతా గులాబీమయం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లను గులాబీ జెండాలతో నింపారు. ప్రధానంగా ఎల్లమ్మగుట్ట చౌర స్తా, కోర్టు చౌరస్తా, రైల్వేకమాన్ చౌరస్తా తదితర చౌరస్తాలలో గులాబీ జెండాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు పలుచోట్ల కేసీఆర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన వీధుల్లో వరంగల్ రజతో త్సవ సభకు సంబంధించిన వాల్ పెయింటింగ్‌లు చేశారు. నగరంలో ఎటు చూసినా గులాబీ జెండాలే దర్శనమిస్తున్నాయి.

గన్నీ సంచుల కోసం రైతుల ఆందోళన



తాడ్‌బిలోలి సొసైటీ గోదాం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

రెంజల్,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలిసొసైటీ గోదాం వద్ద శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. సొసైటీకి మూడు రోజుల క్రితం వచ్చిన గన్నీ సంచులు రైతులకు అందించకుండా జాప్యం చేస్తుండడంతో శనివారం రైతులు సొసైటీ గోదాం వద్ద ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో తొందరగా కొనుగోలు చేపట్టాలని కోరుతున్న గన్నీ సంచులను సక్రమంగా అందించకపోవడంతో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ఎప్పుడెప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిలగడంతో ఆగ్రహించిన రైతులు శనివారం సొసైటీ గోదాం వద్ద ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు సొసైటీ సిబ్బంది గన్నీ సంచులను పంపిణీ చేసి కొనుగోళ్లను ప్రారంభించారు.

నవీపేట తడగామ కాలనీలో నీటి కొరత



ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

నవీపేట,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తడగామ కాలనీలో నీటి కొరత ఏర్పడింది. మూడు రోజుల క్రితం కాలనీకి నీటిని సరఫరా చేసే బోరు మోటారు పాడైపోగా మరో బోరు మోటారుకు చెందిన పైపులైన్ సైతం దెబ్బతినడంతో నీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో కాలనీలో నెలకొన్న నీటి కొరతను తీర్చడానికి గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెందిన ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. తడగామ కాలనీలో రెండు తాగునీటి ట్యాంకులు ఉన్న అందులోకి నీటి సరఫరా జరగకపోవడంతో అవి వృథాగా ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌ను వివరణ కోరగా పాడైపోయిన బోరు మోటార్‌ను శనివారం సాయంత్రం లోగా మరమ్మత్తులు చేయించి నీటి సరఫరా చేయిస్తామని పేర్కొన్నారు.

కందకుర్తిలో నీటి కష్టాలు



నీటి కోసం ఎదురు చూస్తున్న కాలనీవాసులు

రెంజల్,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటి కష్టాలతో కందకుర్తి గ్రామం కటకటలాడుతుంది. గ్రామంలోని 4వ వార్డులో తాగునీటి కష్టాలు తీవ్రతరం అయ్యాయని గ్రామస్థులు కుళాయిల వద్ద ఆందోళన చేపట్టారు. గుక్కెడు నీళ్ల కోసం గంటల తరబడి ఎదురు చూసిన ఒక్క బిందె కూడా నీళ్లు అందని పరిస్థితి నెలకొందని అన్నారు. శనివారం 4వ వార్డు సభ్యులు తాగునీటిని అందించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోవడంతో కుళాయిల వద్ద నిరసన వ్యక్తం చేశారు. వేసవి వచ్చిందంటే కందకుర్తి గ్రామంలో నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మురికి కాలువల వద్ద కుళాయిలు ఉన్న పట్టించుకునే నాథుడే లేదని ఆరోపించారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటి కష్టాలను పరిష్కరించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వివాహిత అదృశ్యం

కోటగిరి,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి(54)అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. లక్ష్మి ఈ నెల 17వ తేదిన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త శివరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోటగిరి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని రాణంపల్లిశివారులో శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం తగిలి పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బోయి శ్రీనివాస్ తన గేదెలను మేపేందుకు పంట పొలం వైపు తీసుకెళ్లాడు. మేత మేసుకుంటూ వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.1.25లక్షల విలువ ఉంటుందని రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించాలని రైతు డిమాండ్ చేశారు.

యంచలో సర్టిఫికెట్ల పంపిణీ

నవీపేట,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో గత ఆరు రోజులుగా స్వయం ఉపాధి శిక్షణ పొందిన యువతి, యువకులకు శనివారం సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానిక యువతి, యువకులకు స్వయం ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం రాచయ్య, ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన రామకృష్ణ, నవీన్, బాలస్వామి, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని శివారులో శనివారం వడ్ల కుప్ప వద్ద ఉంచిన రాళ్లను ఢీకొని రాజీవ్‌నగర్ తండాకు చెందిన బానోవత్ భాస్కర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. రాజీవ్‌నగర్ తండాకు చెందిన భాస్కర్ సొంత పనుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందన్నారు. క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టేటప్పుడు ఇతరులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

వరంగల్ సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

ఎడపల్లి,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):నేడు వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తరలి వెళ్లారు. వరంగల్‌కు తరలి వెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్క స్వామి, నాయకులు మహబూబ్, కాంపల్లి రాజు, ఎల్లయ్య, టీఆర్‌ఎస్ శ్రీను, దుబాయ్ శ్రీను, హైమద్, మహమూద్‌చ ఇర్షాద్ తదితరులు ఉన్నారు.

కోటగిరి: వరంగల్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు అయి 25ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభను పురస్కరించుకుని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రుద్రూరు మండలంలోని అంబం, చిక్కడ్‌పల్లి, సులేమాన్ నగర్ గ్రామాలలో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 8గంటల లోపు అన్ని గ్రామాలలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి రుద్రూరుకు చేరుకోవాలని నాయకులు కోరారు. రుద్రూరు వాహనాల్లో వరంగల్‌కు పెద్ద ఎత్తున తరలివెళ్తామని నాయకులు తెలిపారు.

దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

● నిందితుల నుంచి తులం బంగారం, మూడు సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం ● షేర్‌చాట్‌లో వీడియో చూసి దోపిడీకి పాల్పడ్డ నిందితులు

నవీపేట,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మోపాల్ మండలం కంజరకు చెందిన ముగ్గురు ఒకే దగ్గర కలిసి కూలీ పనులు చేస్తుండేవారు. వారికి కల్లు తాగే అలవాటు ఉంది. తరుచుగా కల్లు దుకాణం నుండి కల్లు తెచ్చుకుని ఇంటి వద్దనే ముగ్గురు కలిసి తాగుతూ సులభ మార్గంలో డబ్బులు వచ్చే మార్గాల గురించి ఆలోచించే వారు. దీనికి దొంగతనమే సరైన మార్గమని నిర్ణయించుకున్నారు. దీనికి అనుగుణంగా ఈ నెల 24న సాయంత్రం ముగ్గురు కలిసి కల్లు తాగుతూ సెల్‌ఫోన్‌లో దొంగతనం ఎలా చేయాలో అనే విషయంపై షేర్‌చాట్‌లో వీడియో చూసి దానిని మరుసటి రోజు అమలు చేయడానికి యత్నించి వారు కటకటల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ వినయ్‌లు నవీపేట పోలీస్ స్టేషన్‌లో వివరించారు. వారు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్ మండలం కంజరకు చెందిన కలూరు లత, పంతుల విజయ అనే ఇద్దరు మహిళలతో పాటు ఈర్ల సాయికుమార్ అలియాస్ సాయి ముగ్గురు కలిసి శుక్రవారం సాయంత్రం నవీపేట బస్టాండ్‌లో దొంగతనం చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో మండలంలోని నాడాపూర్‌కు చెందిన రాచర్ల కిష్టబాయి అనే వృద్ధురాలు ఉదయం మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా యాతాలంలో జరిగిన ఒక వివాహ వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లింది. సాయంత్రం తన స్వగ్రామానికి వెళ్లడానికి నవీపేట బస్టాండ్‌కు చేరుకుంది. ఇదే సమయంలో ఆమె అక్కడే ఉన్న మరుగుదొడ్డిలోకి వెళ్లగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న కాలూరు లత తన వెంట తెచ్చుకున్న కత్తిని, పంతుల విజయ తన వెంట తెచ్చుకున్న కారంపొడిని తీసుకుని వృద్ధురాలు వెళ్లిన బాత్‌రూమ్ వైపు వెళ్లారు. ఈ సమయంలో సాయికుమార్ బయట కాపలా కాశాడు. లోపలికి వెళ్లిన ఇద్దరు మహిళలు వృద్ధురాలి కళ్లల్లో కారం చల్లి కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న మెడలోని బంగారు గుండ్లతో పాటు చెవికి ఉన్న బంగారు పడిగెలను తీసుకుని పారిపోయారు. నిందితులను శనివారం అరెస్టు చేసి వారి వద్ద నుండి తులం బంగారంతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బంది, ఐడీ పార్టీ సిబ్బందిని సీఐ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన ముగ్గురు నిందితుల అరెస్టు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):మండలంలోని సికింద్రాపూర్ గ్రామ శివారులో ఈనెల 3న డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బైరం రవీంద్రవర్మ ను ముగ్గురు నిందుతులు దారిదోపిడికి పాల్పడి గాయపర్చగా 44వ జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో రోడ్డుపక్కనే పడివున్న బైరం రవీంద్రవర్మను చికిత్స నిమిత్తం అదే రాత్రి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బైరం రవీంద్రవర్మ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడని ఎస్సై తెలిపారు. తొలుత గుర్తు తెలియని వాహనం ఢీ కొని చనిపోయాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఘటన స్థలంలో మృతుడి ఫోన్, బ్యాగ్ లభించకపోవడంతో ఆ దిశగా కనబడకుండా పోయిన మొబైల్‌ఫోన్ ఆధారంగా డిచ్‌పల్లి సీఐ కే. మల్లేష్ ఆదేశాల మేరకు ఎస్సై సీహెచ్ తిరుపతి, పోలీసులు విచారణ జరుపగా బైరం రవీంద్రవర్మ కేసులో ముగురు నిందితులను పట్టుకొని విచారించగా ఏ1 నిందితుడిగా లక్ష్మీనర్సింహులు, ఏ2 నిందుతులుగా చింతల కృష్ణ, ఏ3 నిందితుడిగా కరమంచి మారుతిని పట్టుకుని విచారించగా వారు ముగ్గురు కూడా బంధువులని వారి జల్సాలకు డబ్బులు లేకపోవడంతో ఆ ముగ్గురు కూడా ఒంటరిగా ఉండే అమాయకపు ప్రజలను లక్ష్యంగా చేసుకొని దోపిడి చేయాలని పథకం వేసుకొని వారి పథకం ప్రకారం ఈ నెల 3న రాత్రి ఆర్మూర్ వైపు వెళ్లి మామిడిపల్లి జంక్షన్ వద్ద మద్యం దుకాణం వద్ద మద్యం తాగి చేతులో స్మార్ట్ మొబైల్ ఫోన్, వెనకాల బ్యాగ్‌తో ఉన్న రవీంద్రవర్మను ముగ్గురు నిందితులు లిఫ్ట్ ఇస్తామని చెప్పి అతన్ని నమించి వారి మోటర్ సైకిల్‌పై ఎక్కించుకొని కొద్దిదూరం వెళ్లిన తర్వాత సికింద్రాపూర్ గ్రామ శివారులో వాహనంను ఆపి వారి పథకం ప్రకారం రవీంద్రవర్మని భయపెట్టి, బెదిరించి అతని వద్ద ఉన్న ఫోన్, బ్యాగ్ డబ్బులను దోచుకొని మృతుడు వారికి ఎదురు తిరగడంతో బండరాయితో కొట్టగా అతను స్పృహకోల్పోయి కింద పడిపోవడంతో మృతిచెందాడని అనుకొని ఎవరికి అనుమానం రావద్దని అతన్ని 44వ జాతీయ రహదారి పక్కనే పడేసి ఏదో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లినట్లు చిత్రీకరించగా గాయాలతో ఘటన స్థలంలో ఉన్న రవీంద్రవర్మని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడని ఎస్సై తెలిపారు. నిందుతులు నేర చరిత్రను కలిగి ఇదివరకు కామారెడ్డి, దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి నేరాలు చేశారని ఎస్సై తెలిపారు. శనివారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.



నిందితులను అరెస్టు చేసి చూపుతున్న డిచ్‌పల్లి సీఐ మల్లేష్

మోర్తాడ్‌లో మేడే పోస్టర్ల ఆవిష్కరణ

మోర్తాడ్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం టీయుసీఐ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. మేడే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జమున, జి. కిసాన్, చిన్నక్క, నర్సయ్య, రాజేశ్వర్, దుర్గయ్య, సువర్ణ, లత, గంగాధర్, మజీద్, బాజన్న, గంగవ్వ, ముత్తెన్న, దేవన్న, సురేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో పీకేటీపీ బీడీ సెంటర్ వద్ద బీడీ ప్యాకర్స్, బీసీ కార్మికులతో కలిసి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా నాయకులు జీ. అరవింద్ మాట్లాడుతూ 1886 కంటే ముందు 18 గంటల నుండి 20 గంటల పనిదినాలు ఉండేవని పనిగంటలు తగ్గించుకోవడం కొరకు దేశవ్యాప్తంగా ఆనాడు కార్మికులు రోడ్లపైకి వచ్చి తమ నిరసన తెలియజేయడం వలన ఆనాటి అమెరికాలోని చికాగో నగరంలో అప్పుడు ఉన్న ప్రభుత్వ కార్మికులపై కాల్పులు చేయించడంతో కార్మికులు చనిపోతూ ఒక కార్మికుడు తన చొక్కాను చింపి కారుతున్న రక్తంలో ముంచి ఎగరవేసిన జెండానే ఈ 139వ మేడే ఎర్రజెండా అన్నారు.ఆరోజు కార్మికులు పోరాడి సాధించిపెట్టిన 8 గంటల పనిదినాన్ని ఈ రోజు మనదేశ ప్రధాని నరేంద్రమోదీ 8 గంటల పనిదినాన్ని ప్రస్తుతం 10 గంటల నుంచి 12 గంటల వరకు పెంచారన్నారు. పోరాటాలు చేసి 44 చట్టాలను సాధించుకుంటే 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేసి మిగితా 29 చట్టాలను 4లేబర్ కోడ్స్ గా మార్చేసి కార్మికులకు ఎలాంటి సెక్యూరిటి లేకుండా చేస్తున్న మోదీని గద్దెదించేందుకు కార్మికులు తయారు కావాలని పిలుపునిచ్చారు. మే1న ఆర్మూర్‌లో జంబిహనుమాన్ గ్రౌండ్‌లో టీయుసీఐ ఆఫీస్ ముందు నిర్వహించ తలపెట్టిన మేడే జెండా ఆవిష్కర కార్యక్రమంలో అన్ని రకాల కార్మికులు, కర్షకులు, మేదవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ ప్యాకర్స్ కార్మికులు గంగాధర్, లింబాద్రి, అన్వర్, పద్మ, హేమలత, సాయన్న, రాజేందర్, ఆనంద్, కావేరి, జ్యోతి, మనిష, మురళి, రమేష్, స్రవంతి, జగదీష్, రెడ్డన్న, బుచ్చిరాములు, హన్మాండ్లు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో మేడే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

కోటగిరిలో కొవ్వొత్తుల ప్రదర్శన



కోటగిరిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

కోటగిరి,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో శనివారం పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పహల్గాం దాడిని ఖండించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఉగ్రవాదుల దాడిలో అమరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి నన్నేసాబ్, జాకీర్ హుస్సేన్, లింగం, అయూబ్, బ్రహ్మం, వసురాం, అర్జున్, సాయవ్వ, పోచవ్వ పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో శనివారం రాత్రి మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో 28 మందిపై అమాయకులపై ముష్కరులు కాల్పులు జరిపి చంపివేయడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాసర రోడ్డు నుండి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు మైనారిటీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో గాలికుంటు నివారణ టీకాలు

వేల్పూర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):మండలం జాన్కంపేట్ గ్రామం లో మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం గేదే, గోజాతి పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, మౌలానా, దయానంద్, బాబులాల్, గోపాలమిత్ర, గ్రామ పాడిరైతులు తదతులు పాల్గొన్నారు.

మందన్‌పల్లిలో..

మాక్లూర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే తెలిపారు.ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పశువైద్యసిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

29న చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29వ తేదిన చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోధన్ డివిజన్ జేఏసీ అధ్యక్షులు నర్సింహచారి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చేతి కులవృత్తులను కాపాడుకోవాలని, కులవృత్తులపై వీడీసీల దౌర్జన్యం నశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ నాయకులు గంగాధర్ గౌడ్, కోటగిరి రామాగౌడ్, గోసంగి సంఘం రాష్ట్ర నాయకులు రాజేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాగర్, యాదవ సంఘం జిల్లా నాయకులు నక్క లింగారెడ్డి, బోధన్ మండల గౌడ సంఘం అధ్యక్షులు అశోక్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల దొంగలను పోలీసులకు అప్పగింత

నవీపేట,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌లో బోరు బావుల వద్ద కెబుల్ వైర్లను దొంగతనం చేసిన ఇద్దరికి స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం రోజున స్థానిక బోరు బావుల వద్ద కెబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడుతుండగా ఒక పురుషుడితో పాటు మరో మహిళను స్థానికులు పట్టుకున్నారు. నందిపేటకు చెందిన మహిళతో పాటు దోమకొండకు చెందిన మరో వ్యక్తి ఇద్దరు కలిసి కెబుల్ వైర్లను చోరీ చేశారని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ వినయ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

గర్భిణులు అంగన్‌వాడీ సెంటర్లలో భోజనం చేయాలి

మోర్తాడ్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): గర్భవతిగా ఉన్న మహిళలు ప్రతీరోజు అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చి భోజనం చేయాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ మంజులా కోరారు. శనివారం మండలంలోని వడ్యాట్ గ్రామంలో ఈసీసీఈ డే, ఎన్పల్ డే సందర్భంగా గర్భిణీలకు వైద్యపరీక్షలు, అన్నప్రసన చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ మంజులా, హెల్త్ సూపర్ వైజర్, ఏఎన్ఎం, అంగన్‌వాడి టీచ్లు కవిత, శోభ, ఆశవర్కర్ మమత, తల్లులు, బాలింతలు, గర్భవతులు, పిల్లలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండంలోని ఉప్లూర్ గ్రామంలోని 245 వ అంగన్‌వాడి సెంటర్‌లో నాల్గవ శనివారాన్ని పురస్కరించుకుని పూర్వ బాల్యదశ సంరక్షణ, విద్యా (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యూకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ సరిత, ఆయ పసుపుల లక్ష్మీ, చిన్నారులు, తలిదండ్రులుపాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఏడుగురికి గాయాలు

ఆలూర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని గగ్గుపల్లి శివారులో శనివారం తెల్లవారు జామున ఆటోబోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఏడుగురు ప్రయాణీకులతో గగ్గుపల్లి నుండి ఆర్మూర్ వస్తున్న ఆటో గ్రామ శివారులో అడవి పంది రోడ్డుపైకి రాగా పందిని తప్పించబోయి ఆటో బోల్తాపడి ఈ ప్రమాదం జరిగింది. వీరిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మి, వసంత, మమత, మల్లవ్వ, డ్రైవర్ నారాయణ, పోసానిలకు గాయాలు కాగా స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారాం అందించగా గాయపడిన వారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్మూర్ మున్సిపల్ ఆఫీస్‌కి పని నిమిత్తం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందులో పోసాని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

చెరువులో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో పెద్ద చెరువులో ఉన్న బావిలో పడి గ్రామానికి చెందిన మాడవేరి ముత్యం (50) మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. శుక్రవారం రాత్రి తాగిన మైకంలో ప్రమాదవశాత్తు ముత్యం పెద్దచెరువులో బావిలోపడి మృతి చెందారని మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారని తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు లేరని మృతుడి అన్న శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్దాపూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామ స మీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పచ్చల నడ్కుడలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నిధులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిల సహకారంతో ఈ చెక్కులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, నాయకులు గట్టవతల నర్సారెడ్డి, నెహ్రూ, లింగేశ్వర్, అలిముద్దిన్, చిన్నముత్తెన్న, మండల బోజన్న, జల్ల భూమన్న, కుర్మ సాయిరాం, చక్రపాణి, బాబులు మనిష్, కృపల్, భూమన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కోటగిరి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో హైమద్ అనే వ్యక్తికి శనివారం 22 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్, నాయకులు అఫ్జల్, సయ్యద్ అహ్మద్, కరీం తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రజల ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి అన్నారు. శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సాలూర సహకార సంఘం అధ్యక్షులు అల్లె జనార్ధన్, ఏఎంసీ డైరెక్టర్ భూమయ్య, జాడి దేవదానం, కుమ్మన్‌పల్లి నరేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ హన్మాండ్లు పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, సాయిలు, సాయిరెడ్డి, నజీర్, పోశెట్టి, సాయికుమార్, ధర్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు



సుండు సతీష్ కుటుంబం

ఎడపల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన సుండు సతీష్ అనే వ్యక్తి ధర్మారం గ్రామానికి చెందిన సుండు యాదగిరి, సుండు నర్సయ్య, మద్దిగారి అరుణ్‌కుమార్‌లతో తన కుటుంబానికి ప్రాణహానీ ఉందని శనివారం జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత వారం రోజుల క్రితం తాను కౌలు చేస్తున్న పొలంలో అక్రమంగా చెట్టును నరకడంతో ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేయగా ఫారెస్టు అధికారులు వచ్చి చెట్టును పరిశీలించి చెట్టును నరికిన సుండు యాదగిరి, ఇతర వ్యక్తులపై 5వేల జరిమానా విధించారు. ఇది జీర్ణించుకోలేని అ ముగ్గురు వ్యక్తులు నాపై కక్ష్యకట్టి నన్ను అంతమొందించాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం రాత్రి తన ఇంటిపై గొడ్డళ్లతో, గునపంతో దాడి చేయగా ఇరుగుపొరుగు వారు, కులస్థులు అడ్డుకున్నారని తెలిపారు. అదే రాత్రి 100కు డయల్ చేయగా ఎడపల్లి పోలీసులు వచ్చి నన్ను కాపాడారని తెలిపారు. గతంలో ఈనెల 11వ తేదీన ఆ ముగ్గురు నాపై దాడి చేయడంతో ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఎలాంటి చర్య తీసుకోక పోవడంతో వారు రెచ్చిపోయి నాపై తిరిగి దాడి చేశారన్నారు. సుండు యాదగిరి గతంలో నాపై పలుమార్లు దాడి చేయగా ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అతనిపై పలు కేసులు నమోదయ్యాయని, సుండు నర్సయ్య అనే వ్యక్తి యాదగిరిని రెచ్చగొట్టి నన్ను చంపించడానికి చూస్తున్నాడని తెలిపారు. గతంలో అనేక సార్లు నాపై, నాభార్యపై దాడి చేశారని తెలిపారు. సుండు నర్సయ్య సుండు యాదగిరిని రెచ్చగొడుతూ వాన్ని చంపేయ్ రెండు నెలల్లో నిన్ను బయటకు తీసుకువస్తా అని అనడంతో సుండు యాదగిరి, నర్సయ్య, అరుణ్ కుమార్‌లు శుక్రవారం రాత్రి గొడ్డల్లు, గనపాలతో నా ఇంటిపై దాడి చేశారని వారివల్ల నాకు నా కుటుంబానికి ప్రాణహాణి ఉందని వారిపై చర్యలు తీసుకుని నన్ను నా కుటుంబాన్ని కాపాడాలని కోరతూ జిల్లా సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మిర్ధాపల్లిలో బడిబాట కార్యక్రమం

ఆలూర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం మిర్ధాపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రాజశ్రీ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న వసతులను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రాగి అంబలి, కోడిగుడ్డు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం బోదెపల్లి గ్రామానికి చెందిన మామిడి నివేదిత తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. మొదడుకు రక్తం సరఫరా కొరకు ఎస్‌టీఏ ఎంసీఏ బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. వైద్య సహాయం కొరకు వారి కుటుంబ సభ్యులు బాల్కొండ కాంగ్రెస పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 2లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చేయించి నివేదిత తండ్రి రాజేశ్వర్‌కు అందజేశారు. తమకు ఎల్‌వోసీ ఇప్పించిన ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భీమ్‌గల్: మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన ఆకుల గంగానర్సు గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు చికిత్స నిర్వహించి, తక్షణమే గుండెకు ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆమె నిరుపేద కుటుంబానికి చెందినది. ఈ విషయాన్ని మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ దృష్టికి తీసుకు పోవడంతో సీఎం సహాయనిధి నుంచి రూ. 2లక్షల 25వేలు ఎల్‌వోసీ మంజూ రు చేయించి శనివారం హైదరాబాద్‌లో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్‌వోసీ ఇప్పించిన ఈరవత్రి అనిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

భీమ్‌గల్‌లో బంద్ విజయవంతం

భీమ్‌గల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):కాశ్మీర్‌లో ఉగ్రవాదులు హిందువులపై దాడులు చేసి చంపడాన్ని నిరసిస్తూ విహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బందు విజయవంతం అయింది. వ్యాపారులు, ప్రైవేట్ వాహనాల వారు బందుకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బందు కొనసాగగా పట్టణం నిర్మానుష్యంగా మారింది. అనంతరం ఉగ్రవాద దాడుల్లో అసువులు బాసిన వారికి నివాళులు అర్పించారు. దేశంలో అక్రమంగా చొరబడిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన వారితో పాటు రోహింగ్యాలను దేశంనుంచి వెల్లగొట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూరులో శ్రీ గోరిబా కాకా పుణ్యతిథి వేడుకలు

కోటగిరి,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):రుద్రూరు మండల కేంద్రంలో శనివారం కుమ్మరి కులస్థుల ఆరాధ్య దైవం అయిన శ్రీ గోరిబా కాకా పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుమ్మరి, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి, శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

● ప్రమోద్, మండల పశు సంవర్ధకశాఖ అధికారి, ఎడపల్లి



ఆంధ్రజ్యోతి: వేసవికాలంలో పశువుల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

అధికారి: పాడి పశువులను ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మేతకు తీసుకువెళ్లాలి. తాగునీరు పుష్కలంగా అందు బాటులో ఉంచి చల్లని ప్రదేశాలలో పశువులను ఉంచాలి. రెండు పూటల నీటితో కడగాలి.

ఆంధ్రజ్యోతి: మండలంలో పశువుల సంఖ్య ఎంత?

అధికారి: ఎడపల్లి మండలంలో ఆవులు 1519, గేదెలు 5121, గొర్రెలు 22495, మేకలు 2396, దేశీ నాటుకోళ్లు 18159 ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని పశువైద్యశాలలు ఉన్నాయి?

అధికారి: ఎడపల్లి మండల కేంద్రంలోని పశువైద్యశాలతో పాటు మండలంలోని జైతాపూర్, రాణాకలాన్ గ్రామాలలో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: వేసవికాలంలో పాల ఉత్పత్తి తగ్గకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏవి?

అధికారి: వేసవి కాలంలో పాల ఉత్పత్తి తగ్గకుండా పాడి పశువులకు కాల్షియం, మినరల్ మిక్చర్ అందించితే పాల ఉత్పత్తి తగ్గకుండా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందా?

అధికారి: మండలంలోని కొన్ని గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందించాం. మరికొన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలి.

● (ఎడపల్లి, ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాల జోన్‌ల పరిశీలన

గాంధారి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు యాక్సిడెంట్ రిసొల్యూషన్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఏ విధంగా చోటు చేసుకుంటున్నాయనేది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎంవీఐ భిక్షపతి, ఎస్సై ఆంజనేయులు, ఏఈ రవితేజ పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న బాల్కొండ బస్టాండ్



వృథాగా ఉన్న భీమ్‌గల్ బస్టాండ్



యాచకులకు నిలయంగా మారిన మాక్లూర్ బస్టాండ్

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణాలు

● శిథిలావస్థకు చేరుతున్న బస్టాండ్‌లు ● ప్రయాణికుల రద్దీ పెరిగినా బస్టాండ్‌లలో మరమ్మతులు కరువు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం రోడ్డు రవాణా సంస్థ వారు నిర్మించిన ప్రయాణ ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో ప్రయాణీకుల రద్దీతో కిటకిటాడిన బస్టాండ్‌లు నేడు ఉత్సహ విగ్రహాలుగా మిగిలిపోయాయి. కొన్ని మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ల వద్దకు బస్సులు వెళ్లడం లేదు. అంతేకాకుండా ప్రయాణ ప్రాంగణాలు ఊరికి కొద్ది దూరంలో ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. కొన్ని చోట్ల యాచకులకు నిలయాలుగా ఉన్నాయి. 1983లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాలుకలస్థానంలో పరిపాలన సౌలభ్యం కోసం మండలాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ప్రతీ మండల కేంద్రంలో రోడ్డు రవాణాసంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రయాణ ప్రాంగణాలను నిర్మించింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కొన్ని మండలాలలో మాత్రమే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోనికి వెళ్తున్నాయి. మిగతా మండలాల్లో బస్సులు రోడ్లపైనే నిలిపి ప్రయాణీకులను తీసుకుంటున్నారు.

నిరుపయోగంగా మాక్లూర్ బస్టాండ్

మాక్లూర్ మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. గ్రామానికి అతిసమీపంలో ఉన్నప్పటికి బస్టాండ్‌ను వినియోగించుకోవడం లేదు. నిజామాబాద్ నుంచి నందిపేట్ వెళ్లే బస్సులు రోడ్డు పక్కనే ఉన్న బస్టాండ్ వద్దనే నిలిపితే ప్రజలకు అలవాటుగా మారుతుంది. బస్టాండ్‌ను ఉపయోగించకుండా వచ్చిపోయే బస్సులు గ్రామ చౌరస్తాలో రోడ్లకు ఇరువైపులా నిలపడం వల్ల ఆ రోడ్డు వెంబడి వెళ్లే ఇతర వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. అంతే కాకుండా బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు మహిళలు, వృద్ధులు ఎండలో, వర్షంలో నిలబడాల్సి వస్తోంది. వృథాగా ఉన్న బస్టాండ్‌లను ఉపయోగంలోకి తీసుకువస్తే ప్రజలకు అన్ని విధాల సౌకర్యంగా ఉంటుంది.

ఊరికి మధ్యలో ఉన్నా నిరుపయోగమే

భీమ్‌గల్ ఒకప్పుడు తాలుఖ కేంద్రం. మండలాలు ఏర్పడిన తర్వాత మండల కేంద్రంగా ఉండి ప్రస్తుతం మున్సిపల్‌గా మారింది. గతంలో నిర్మించిన బస్టాండ్ గ్రామం మధ్యలో ఉంది. ఇతర గ్రామాలకు సౌకర్యంగా ఉన్నప్పటికి ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. నిర్మించిన బస్టాండ్ ఉన్నప్పటికీ అన్ని బస్సులు పాతబస్టాండ్‌లోనే నిలుపుతున్నారు. ఇక్కడ కూడా ప్రయాణికులకు ఎండకు, వర్షాలకు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. బస్టాండ్ నిర్మించిన అనంతరం కొన్ని రోజుల పాటు బస్టాండ్‌కు బస్సులు వచ్చిన రానురాను పూర్తిగా తగ్గించేశారు. నిత్యం వందల సంఖ్యలో భీమ్‌గల్ మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. కానీ ప్రయాణికులకు సరైన బస్టాండ్‌లేక అవస్థలు తప్పడం లేదు.

జాతీయదారి పక్కన ఉన్నా నిరుపయోగమే

బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. 16వ జాతీయ రహదారికి పక్కనే ఉన్నప్పటికీ బస్టాండ్ వాడుకలో లేదు. ఇక్కడ కూడా పాత జాతీయ రహదారిపైనే బస్సులు నిలుపుకుంటారు. అంతేకాకుండా వేల్పూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. వాడుకలో లేక యాచకులకు నిలయంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మీ పథకం ప్రవేశపెట్టడంతో బస్సులు నిత్యం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులు, మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నా దృష్ట్యా నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌లకు మరమ్మతులు నిర్వహించి ఉపయోగంలోకి తీసుకువస్తే సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పంటల బీమా.. రైతులకేదీ ధీమా?

● రాష్ట్రంలో అమలు కాని ఫసల్ బీమా పథకం ● బీమా అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం ● పథకం అమలు కాక ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు



అకాల వర్షాలకు నేలకొరిగిన వరి పంట



సోంపూర్ శివారులో నేల రాలిన ధాన్యం గింజలు(ఫైల్)



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు(ఫైల్)

కోటగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకం అమలులో లేకపోవడంతో జిల్లా రైతులు నష్టపోతున్నారు. పంటల సాగు మొదలుకుని చేతికి వచ్చే వరకు రైతులు అవస్థలు పడుతున్నారు. గత వర్షాకాలం, ప్రస్తుత రబీ సీజన్‌లో కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈదురు గాలులు, వడగండ్ల వానతో వందలాది ఎకరాలలో వరిపొలాలు, పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఫసల్ బీమా పథకం అమలులో లేకపోవడంతో బాధిత రై తులకు పరిహారం అందకుండా పోయిన పరిస్థితులు తలెత్తాయి. రైతు లను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలుకు నోచుకోవడం లేదు. ఫసల్ బీమా యోజనతో పాటు పునర్‌వ్యవస్థీకరించిన వాతారణ ఆధారిత పంటల బీమా పథకం 2018-19సాగుకాలానికి సంబంధించి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు కేంద్రం లక్ష్యం విధించినప్పటికీ అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో పథకం అమలుకు కార్యరూపం దాల్చలేదు. పంట బీమా పథకంలో చే రేందుకు రైతులందరూ అర్హులు కాగా పంటరుణం పొందే రైతులు ఈ పథకంలో తప్పనిసరిగా చేరాలనే నిబంధన ఉండేది. రుణం పొందని రైతులు బ్యాంకుల ద్వారా గాని అనుమతి పొందిన మధ్యవర్తి సంస్థల ద్వారా, కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా పథకంలో చేరే వెసులుబాటు కల్పించిన ప్పటికి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు పంట బీమా చేయించుకునేందుకు ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీమా పథకంపై మార్గదర్శకాలు జారీ అవుతాయని ఎదురు చూస్తున్నా రైతులకు గత ఏడాదిగా నిరాశే ఎదురవుతుంది. రెండు సీజన్‌లు గడిచిన ఫసల్ బీమా యోజన అమలుల్లోకి రాక పోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్న భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

● రైతుల్లో అవగాహన లేమీ

పంట బీమా పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో రైతులు ఈ ఫసల్ బీమా పథకానికి దూరమవుతున్నారు. బ్యాంకులో పంట రుణం పొందే సమయంలోనే బ్యాంకర్లు పంట బీమా నమోదు చేసేవారు. కాని బ్యాంకర్లు బీమా పథకాన్ని రైతులకు తెలియజేయక పోవడంతో రైతులు సైతం బీమా చెల్లించే పరిస్థితులు లేకుండా పోయాయి. బ్యాంకర్ల అలసత్వం కూడా రైతుల పంట బీమా పరిహారానికి దూరం చేస్తున్నాయి. రాష్ట్రంలో చివరి సారిగా 2018-19పంట కాలానికి సంబంధించి బీమా పథకం అమలు చేశారు. జిల్లాలో గతంలో కొంతమంది రైతులు మాత్రమే పంట నష్ట పరిహారం పొందారు. ఆ తర్వాత నుంచి ఈ పథకం కనుమరుగైనట్లయింది.

● బీమాతో రైతులకు ధీమా

ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు వేసుకునే రైతులకు ఫసల్ బీమా యోజన ధీమాగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే ఈ పథకానికి అర్హులైన వారికి పరిహారం వర్తిస్తుంది. బీమా వర్తించాలంటే ముందుగా రైతులు బ్యాంకుల్లో ఖరీఫ్ సీజన్‌లో రెండుశాతం, రబీ సీజన్‌లో 1.5శాతం, వాణిజ్య, ఉద్యాన వన పంటలకు 5శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ప్రీమియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం చొప్పున భరిస్తాయి. కాగా ఇందులో రైతు వాటా ప్రభుత్వమే చెల్లిస్తుందని గతంలో ప్రకటించారు. ప్రస్తుతం పై దీనిపై కూడా స్పష్టత కరువైంది.

● ఫసల్ బీమా అమలైతే రైతులకు లాభం

ఫసల్ పథకం అమలు అమలైతే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఒక హెక్టార్‌కు 33-50శాతం నష్టం వాటిల్లితే వరికి 1.05లక్షలు, మొక్కజొన్నకు 90వేల పరిహారం చెల్లిస్తారు. ఇందుకు ప్రీమియంగా 1575రూపాయలు, మొక్కజొన్నకు 1350 రూపాయలు బ్యాంకులో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లాల వారిగా ప్రధానంగా సాగయ్యే పంటలకు బీమా పథకాన్ని అమలు చేస్తారు. జిల్లా, మండల యూనిట్లుగా పంటలను ఎంపిక చేసి ఈ పథకాన్ని వర్తించేలా చర్యలు తీసుకునే పరిస్థితులు ఉండగా ఇప్పుడు ఆ ఊసే లేకుండా పోయింది.

● కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలయ్యేనా.!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోకుండా ఉండేందుకు ఫసల్ బీమా పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్న ఫసల్ బీమా పథకం ప్రస్తావన తీసుకురాకపోవడంతో రైతుల్లో గందరగోళం నెలకొంది. ఫసల్ బీమా పథకం అమలు అయితే పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఆలయం ముందు డప్పు వాయిద్యాల దృశ్యం

వైభవంగా బీరప్ప కల్యాణం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో కురుమ కులస్థుల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ పట్టణ సంఘం అధ్యక్షుడు వీరయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవం ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయన్నారు. అత్యంత వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. బోధన్‌లో 11 సంవత్సరాల తర్వాత ఘనంగా బీరప్ప, కామరతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కురుమ కులస్థుల ఆచారం ప్రకారం కుల పెద్దలచే కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు. కాంగ్రెస్ నాయకులు, నుడా చైర్మన్ కేశ వేణు, ఉమ్మడి జిల్లాల సహకార సంఘం అధ్యక్షులు భూమన్న, నిజామాబాద్ కురుమ సంఘం కార్యవర్గ సభ్యులు, బోధన్ నియోజకవర్గ కురుమ సంఘం బంధువులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవం ద్వారా కురుమ కులస్థుల సమాఖ్యత, సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. బీరప్ప కల్యాణ మహోత్సవంలో పట్టణ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తొర్లికొండలో భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వర స్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు నుంచే భక్తులు కొండ పైకి చే రుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కోతుల బెడద తీరేదెన్నడో?

● గ్రామాల్లో పెరిగిన వానర సంచారం ● ప్రజలపై విచ్చలవిడిగా దాడులు
● నెలల వ్యధిలో పదుల సంఖ్యలో బాధితులు ● చోద్యం చూస్తున్న మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు



ఎల్లారెడ్డిలో రోడ్లపై కోతుల గుంపు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఉండటం సరైన ఆహార సౌకర్యాలు లేకపోవడంతో అటవీని వదిలి కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి. దీతో పొద్దున లేచిన దగ్గర నుంచి సాయంత్రం చీకటి పడే వరకు ఇళ్లు, దుకాణాల్లోకి కోతులు చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతుండటంతో పొద్దస్తమానం తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో రోజురోజుకూ కోతుల సంతతి బాగా పెరిగిపోతుందని వాహనదారులు, చిన్నారులు వాటి నుంచి తప్పించుకోవడానికి నానా ఆగచాట్లు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో బాధితులు ఉంటున్న మున్సిపల్, గ్రామ పంచాయితీ అధి కారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు.



ఇళ్లపైన సంచరిస్తున్న కోతులు

● ఇళ్లు పొలాలను చిందర వందర చేస్తున్న వానరాలు

కోతులు ఇంటిపై రేకులు, పెంకులు నాశనం చేస్తూ నానా హంగామా చేస్తున్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పండ్ల చెట్లు, కూరగాయాలను సైతం వదిలిపెట్టడం లేదు. అంతేగాక మొక్కజొన్న పంటల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ పంటల ఆకులు, కాయలు తుంచేస్తుండటంతో రైతు లు ఆర్థికంగా నష్టపోతున్నారు. కోతుల భారీ నుంచి పంటలను కాపాడుకునేందుకు ఓ వైపు దినసరి కూలీలను పంట పొలాల వద్ద కాపాలా ఉంచడమో లేదా వివిధ వేషధారణలతో ఉండి వస్త్రాలను, దిష్టి బొమ్మలను కొనుగోలు చేసి పంట పొలాల్లో పెడుతూ కోతులను సాగనంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్ని చేసినా రైతులకు మాత్రం కోతుల బెడద తీరక పోవడంతో వాటిని పట్టి దూర ప్రాంతాలకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

● ఖాళీ ఇళ్లే నివాసాలుగా...

కోతులు ఆహార శాల అంటూ ఏర్పాటు చేసిన మొక్కల పెంపకంపై అధికారులు సరిగ్గా దృష్టి సారించకపోవడంతో చెట్లు అంతంత మాత్రంగానే పెరిగి వాటికి తినేందుకు ఆహారం దొరకక మళ్లీ గ్రామాలపై పడుతున్నాయి. గ్రామాల్లోని భారీ వృక్షాలు ఎవరకూ నివసించకుండా ఖాళీగా ఉండే ఇళ్ళను వాటి ఆవసా కేంద్రాలుగా ఏర్పాటు చేసుకుని సంచ రిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్ళలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందరగా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకుని పోవడంతో పాటు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఖాళీగా ఉండే ఇళ్లను వాటి ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకుని సంచరిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్లలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రిని చిందర వందరగా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకుని పోవడంతో పాటు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇంట్లో నుంచి ఎవరిని బయటకు రాకుండా చేస్తున్నాయి. రహదారులపై కూరగాయాలు, సరుకులు, తదితర సామాగ్రి తీసుకుని వెళుతున్న పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తుండటంతో వారు సైతం గాయపడుతున్నారు.

● కోతుల సంతతిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి

మా గ్రామంలో కోతుల బెడద బాగా పెరిగింది. వాహనదారులు, చిన్నారులపై గుంపులుగా వచ్చి దాడి చేస్తున్నాయి. దీంతో వీధుల్లో తిరగాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి సంతతిని తగ్గించేందుకు కృషి చేయాలి.

- రఘువీర్ గౌడ్, మాజీ సర్పంచ్ కళ్యాణి



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా శంభులింగేశ్వరుడి కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన శంభులింగేశ్వరుడి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివపార్వతుల విగ్రహాలను ఉంచి కళ్యాణ వేడుకలను జరిపారు. వేదపండితులు వేలేటి పశుపతి శర్మ, ఉమామహేశ్వర శర్మ వేద మంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు దేవశర్మ, రాజుశర్మ కళ్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ స్వామికి ఓడిబియ్యం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జరిగిన అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ భూ సర్వే

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి శివారులోగల 358 సర్వే నెంబర్‌లో అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూమిని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ భద్రత నడుమ సర్వే నిర్వహించారు. ప్రజా అవసరాల కోసం ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినవారు ఎంతటివారైన చర్యలు తీసు కుంటామని సర్వేలో అర ఎకరం వరకు ప్రభుత్వ స్థలం బహిర్గతమైందని తహసీల్దార్ తెలిపారు.

నగరంలో దొంగతనం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూలాంగ్ పాత బ్రిడ్జి వద్ద ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. చిన్నయ్య అనే వ్యక్తి ఈనెల 23న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లగా తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దుండగులు శనివారం తెల్లవారుజామున ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి అందులోని 3తులాల బంగారంతో పాటు 50వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. దొంగలఅలజడికి పక్కింట్లో నివాసం ఉంటున్న చిన్నయ్య కుమారులు నిద్రలేవగా నిందితులు బైక్‌లపై పర్యాయ్యారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన స్థలాన్ని నగర సీఐ శ్రీనివాస్‌రాజు, నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్‌లు పరిశీలించారు. కాలనీలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం'

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తుందని కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తుందని మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను, నిత్యవసర సరుకుల ధరలను ఇష్టానుసారంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, ఫెడరేషన్‌లు పిలుపునిచ్చాయని రాష్ట్రంలోని రెండవ పీఆర్సీ ప్రకటించడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మెలో ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూజిల్లా కార్యదర్శి నూర్జహాన్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, గంగాధర్, గణేష్, రాములు ఉన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, పని కావాల్సిన కూలీలకు జాబ్‌కార్డుతో సహా 200 రోజులు పనికల్పించాలని, ప్రతీ కూలీకి రూ.600 కూలీ ఆయన డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఘన్‌పూర్ పెద్ద చెరువులో ఉపాధిహామీ చేస్తున్న కూలీల తో ఆయన మాట్లాడారు. ఉపాధియాక్ట్ ప్రకారం కూలీలకు కావిల్సిన వసతులు కల్పించాలని నిలువ నీడ లేకుండా నీటి వసతి లేకుండా కూలీలు పనిచేస్తున్నరని వారానికి కూలీలకు ఒక్కరోజు సెలవు 100రోజుల పనిమాత్రమే కల్పిస్తున్నరని ఆరోపించారు. అర్హులైన వారికి ఉపాధి జాబ్‌కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్, నాయకులు దాసు, క్రిష్ణ, దేవయ్య, సృజన్, లక్ష్మీ, సుమలత, శ్రీకాంత్, శ్రీకర్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పూర్తయిన రెండు రోజుల శిక్షణ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు, గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై నిజామాబాద్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో గత రెండు రోజులుగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లాపంచాయతీ అధికారి డి.శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామసభ యొక్క పాత్ర, మెరుగైన గ్రామ పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించడంపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో 33 జీపీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు: ఎస్ఈ

సుభాష్‌నగర్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు వేసవి కాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. నవంబర్ నెల నుండి వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అందుకు అనుగుణంగా లోడ్ పెరిగే అవకాశం ఉన్న జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 242 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 202 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. 26 సబ్‌స్టేషన్లకు ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని అన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఎలాంటి అంతరాయం కలుగకుండా మరమ్మతులు చేశామన్నారు. విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ చాట్‌వాట్ సేవలు

సుభాష్‌నగర్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఉత్తమ సేవలను అందించడంలో భాగంగా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు వాట్సాప్ చాట్‌వాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు మొబైల్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నెంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే టీజీఎన్ పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వస్తుందని చెప్పారు. రిజిస్టర్ కంప్లెయిం ట్, ట్రాక్ కంప్లెయింట్ చాట్ విత్ ఏజెంట్ అని వస్తుందని తెలిపారు. అందులో రిజిస్టర్ కంప్లెయింట్ ఎంటర్ చేయగానే యూనిక్ సర్వీస్ నెంబర్, విత్‌ఔట్ యూనిక్ సర్వీస్ నెంబర్ వస్తుందని ప్రీవిఎస్ మెనూ ప్రత్యక్షమవుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఏజెంట్‌తో కూడా చాట్ చేయవచ్చని కంప్లెయింట్ నమోదు చేసు కోవచ్చని వివరించారు.

కార్మికులకు 8గంటల పని కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బాలయ్య

మోపాల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరికీ 8గంటల పని మాత్రమే కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రఉపాధ్యక్షుడు వెంకటి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోపాల్ మండలకేంద్రంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటి మాట్లాడుతూ 139 ఏళ్ల క్రితం ప్రపంచ కార్మికులంతా పోరాడి 8గంటల పని నేడు శాస్త్ర, సాంకేతిక రవాణా రంగాల్లో విప్లవాత్మక అభివృద్ధి చెందిన ఈ కాలంలో రోజుకు 4 గంటలే పని చేస్తే సకల సంపదలు సృష్టించవచ్చని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం 12 గంటల పనిని కల్పిస్తోందని అన్నారు. దేశ కార్మిక వర్గాన్ని అదనంగా 4గంటలు పనిచేయాలని పార్లమెంట్‌లో ఆమోదించిందని అన్నారు. పని గంటల పెంపుతో కార్మికుల రక్తాన్ని మరింతగా పీల్చిపిప్పి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు రోజు 8గంటల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 47కోట్ల మంది శ్రమజీవులలో కేవలం 7కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ సాంఘిక భద్రతతో కూడిన వేతనాలతో జీవిస్తున్నారని అన్నారు. మిగతా 40కోట్ల మంది శ్రమజీవులు అందరికీ సరిపడా వేతనాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులంతా మేడే స్ఫూర్తితో లివింగ్ వేతనాలకై, పనిభద్రత కోసం, అధిక పని గంటలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ రద్దుకై, నెలకు 9వేల పెన్షన్ సాధన కోసం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాధర్, రాజయ్య, సుమన్, తదితరులు ఉన్నారు.

పని దినాల సంఖ్య పెంచాలి

ధర్పల్లి: ఉపాధిహామీ కూలీల పనిదినాల సంఖ్య పెంచాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం మండలకేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పని దినాల సంఖ్య 200 పెంచి రూ.600 కూలీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఉపాధి పనులను నిలిపివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని గత బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ కింద కేటాయించే నిధులను తగ్గించిందన్నారు. వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా కేవలం 60 రోజులే పని కల్పించి 300 రూపాయల కూలీతో సరిపెట్టిందని అన్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. 12 వారాలుగా కూలీలకు డబ్బులు జమ చేయడం లేదని, దీంతో కూలీలుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఊషన్న, మోహన్, నాయకులు ఉన్నారు.

టీయూసీఐ పోస్టర్‌ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియ (టీయూసీఐ) 139వ మేడే పోస్టర్‌లను శనివారం ఘన్‌పూర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మురళి మాట్లాడుతూ దేశంలో 47కోట్ల మంది శ్రమ జీవుల్లో 7కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ సాంఘిక భద్రత, తగిన వేతనలు ఉంటున్నయన్నారు. మిగతావారికి సరిపడా వేతనాలు, జీవన భద్రత లేదన్నారు. 4లేబర్ కోడ్‌లు నిలిపివేయాలని పనిగంటల పెంపును వ్యతిరేకిస్తూ జిల్లాలో 139వ మేడే జరుపుకోవలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు శ్రీకాంత్, సాయిలు, నరేశ్, నర్సింలు, సాయినాథ్, సాయికుమార్, సుశీల పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా దేవీదాస్, వినయ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చొక్కం దేవీదాస్, నాంది వినయ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో శనివారం మాలమహానాడు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తాజామాజీ అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య. టీం కన్వీనర్ అలుక కిషన్, మాలమహానాడు రాష్ట్ర వర్కిగ్ ప్రసిడెంట్ ఎడ్ల నాగరాజు, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు స్వామిదాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సూచనల మేరకు జిల్లా మాలమహానాడు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా రాజన్న, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, సాయిలు, కోటేశ్వర్‌రావు, గంగాధర్, భోజన్న, సహాయ కార్యదర్శులుగా గంగాధర్, రవీందర్, గంట చిన్నయ్య, బాలస్వామి, నీరడి గంగాధర్, సూర్ పోశెట్టి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా మోహన్, నాగరావు, సాంస్కృతిక కార్యదర్శిగా వందేమాతరం శ్రీనివాస్, పబ్లిసిటీ కార్యదర్శిగా దయానంద్ సోన్‌కాంబ్లే, కార్యవర్గ సభ్యులుగా గోపు మురళీ, సాయిలు, బుచ్చన్న, ప్రభాకర్, బాలయ్య, మోహన్, బాలరాజు, వెంకటేష్, సాయిలులను ఎన్నుకున్నారు. సలహాదారులుగా అలుక కిషన్, దయానంద్, దండు శేఖర్, రాజేంద్ర ప్రసాద్, స్వామిదాస్, పి.శ్రీనివాస్, గోపు ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దేవీదాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కిష్టయ్య, అబ్బి ప్రగతి, పాల్గొన్నారు.

60 సెల్‌ఫోన్‌ల రికవరీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 60 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు అదనపు పోలీస్ కమీషనర్ (సీఎస్‌బి) శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి సెల్‌ఫోన్‌లను వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోయినట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్‌ను వెబ్‌సైట్‌కు వెళ్లి పూర్తి వివరాలను పొందుపర్చాలని తద్వారా సెల్‌ఫోన్‌లను పట్టుకోవడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో కృషి చేసిన మహిళా కానిస్టేబుళ్లు అనూష, సుశ్మలను అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ మస్తాన్ అలీ, ఐటి కోర్ ఆర్ఎస్ఐ నిశిత్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్గాప్రసాద్‌కు గాయాలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. డిచ్‌పల్లి పీఎస్‌లో విధులు నిర్వహించడానికి బైక్‌పై ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లివైపు వెళ్తుండగా అర్గుల్‌వద్ద రోడ్డుపై డీసీఎం అకస్మాత్తుగా నిలిపి ఉండటంతో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కానిస్టేబుల్ భార్య ఎం.గౌతమి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- లబ్ధిదారులతో మాట్లాడిన ఎంపీడీవో భుక్య లింగం నాయక్



కమలపూర్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని గ్రామంలో ప్రభుత్వం 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా 29ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయని మరో 5ఇళ్ల బేస్‌మెంట్ లెవల్‌పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో భుక్య లింగంనాయక్ అన్నారు. శనివారం గ్రామంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేల చొరవ చూపలన్నారు. అనంతరం ఉపాధిహామీ పనుల ప్రాంతాన్ని పరిశీలించి కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేస్తున్న పనికి కూలీ గిట్టుబాటు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నర్సింగపూర్, రాంపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు.

కార్యదర్శులుగ్రామాల నివేదికను తయారు చేసుకోవాలి

ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని గ్రామాల్లోని తాగునీరు, ఉపాధిహామీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అందజేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో భుక్యలింగం నాయక్ అన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను మార్యదపూర్వకంగా కార్యదర్శులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కరం దిశగా కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. ఎంపీడీవోని కలిసిన వారు కార్యదర్శులు రాధిక, జయశ్రీ, వినయ్, రమేశ్, గంగాధర్, కిరణ్, గంగాకిషన్, శ్రవణ్, కార్యాలయ సిబ్బంది ప్రియలత, రాకేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా

అన్నిరంగాల్లోనూ కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా

సుభాష్‌నగర్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుం టున్నారని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభను కార్యకర్తలు, నాయకులు విజయ వంతం చేయాలని పిలుపుని చ్చారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సభకు సన్నద్ధమయ్యా రని, వేలాది మంది కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా సభకు తరలివ చ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ 16నెలల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడినా ఇప్పటికీ కేసీఆరే సీఎం అనే భావనతో ప్రజలు ఉన్నారన్నారు. కుంభమేళాను తలపించే విధంగా రజతో త్సవ వేడుకలు ఉంటాయన్నారు. ప్రజల కోసం పనిచేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. అనంతరం 35వ డివి జన్‌కు సంబంధించిన నరేష్ ఆధ్వర్యంలో వందమంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బిగాల గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం చలో వరంగల్ గులాబీ టీషర్ట్‌లు వేసు కుని సంబరాలు చేసుకున్నారు. డీజే పాటలకు బిగాల కార్యక ర్తల తో కలిసి డ్యాన్సులు చేశారు. టపాకాయలు పేల్చి సంబరాలు చేసు కున్నారు. కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీమాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర అధ్యక్షుడు సిర్పరాజు, మాజీ నూడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రవిచందర్, ఎనగందుల మురళీ, దారం సాయిలు, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, మతీన్, నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కీచక గురువులు!

(5వ పేజీ తరువాయి)

కోరుకుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా చాలాచోట్ల బాలికలు మాత్రం చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారు. బాలికలు చదువును మధ్యలో ఆపడానికి ప్రధానంగా వారి ఆర్థిక పరిస్థితి ఒక కారణం అయితే పాఠశాలల్లో ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు మరో కారణంగా చెప్పవచ్చు. జిల్లాలో గతంలో గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల లైంగిక వేధింపులపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. పాఠశాల స్థాయిలోనే బాలికల తల్లిదండ్రులను పిలిచి ఉపాధ్యాయులతో క్షమాపణ చెప్పించడం, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగవని హామీ ఇప్పించడంతోనే చాలా వరకు ఫిర్యాదులను బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటేనే...

బాలికల పట్ల ఉపాధ్యాయుల లైంగిక వేధింపుల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటి ఘటనలు మళ్లీ జరిగే అవకాశాలు ఉండవు. ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం లేదా పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపడం వంటి చేయడం వల్ల ఉపాధ్యాయుల వ్యవహార తీరులో మాత్రం మార్పు రావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇలాంటి లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని కొంత మంది ఉపాధ్యాయులు చేస్తున్న వికృత చేష్టలకు మొత్తం ఉపాధ్యాయ లోకం విద్యార్థుల దృష్టిలో చెడ్డ పేరు వస్తుందని ఉపాధ్యాయ సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న బాలికలతో పాటు తమతో పాటు పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులతో కొంత మంది అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. కొంత మంది మహిళా ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయుల వేధింపులను చెప్పుకుంటుండగా కొంత మంది ఆ వేధింపులకు మానసికంగా కుంగిపోతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

విద్యార్థినిలపై లైంగిక వేధింపులు తరచూ జరుగుతుండటంపై విద్యాశాఖ, పోలీస్, మహిళా శిశుసంక్షేమ శాఖ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో షీటీమ్‌లు, ఐసీడీఎస్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిని వివరిస్తూ ఎవరైనా బాలికలు ఇబ్బందులకు గురైతే డయల్ 100కు గానీ 181కు కానీ ఫోన్ చేసేలా విద్యార్థినిల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో, వసతి గృహాలలో ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేయాలి. కొంత మంది ఉపాధ్యాయులతో ఫిర్యాదులు చేసేందుకు బయపడే పరిస్థితుల్లో ఉండే అవకాశం ఉండగా ఫిర్యాదు పెట్టెలద్వారా సమస్యలు బహిర్గతమయ్యే అవకాశం ఉంటుంది.

పోలీసు వాహనంలో రీల్స్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కోర్టు వద్ద పో లీసు వాహనంలో ఓ నిందితుడు రీల్స్ చేయడం కలకలం రేపింది. ఒక కేసులో నిం దితుడిగా ఉన్న వ్యక్తి పోలీసు పెట్రోలింగ్ వాహనంలో కోర్టుకు తీసుకెళ్తుండగా రీల్స్ చేయడం వారిని సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో పోలీస్‌శాఖలో చర్చనీయాం శమైంది. నింధితుడిని కలవడానికి వచ్చిన మిత్రులు రీల్స్ తీసి వాటిని సోషల్ మీడి యాలో పోస్ట్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సోహెల్ అనే వ్యక్తి ఫిబ్రవరి 13న హత్యాయత్నం కేసులో కోర్టుకు తీసుకురాగా అప్పుడు తీసిన రీల్స్‌ను ఇప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తవైరల్ అయ్యాయి. నింధితుడినిరీల్స్ ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ అంశంపై పోలీసు అధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఒకరి మృతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని రేకుల షెడ్డు వద్ద 50 ఏళ్లున్న గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. బ్లూకలర్ షర్ట్, బ్లూకలర్ ప్యాంట్ వేసుకొని ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఉండటంతో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డ్ ఆసుపత్రిలోకి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని వ్యక్తి లేబర్ పని చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. అతని ప్యాంట్‌లో ఆధార్‌కార్డు దొరికిందని, తెనాలి రవి సన్ ఆఫ్ తెనాలి పాండు, ఆర్మూర్ మామిడిపల్లి అని ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సమాచారం తెలిసినవారు 1వ టౌన్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్‌లో సంప్రదించాలన్నారు.



చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,300	రూ.90,700	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సారంగపాణి జాతకం (10.40, 1.30, 4.20, 7.10, 10.10)

స్క్రీన్-2 : శివశంభో (11.10)
: నీజా-2 (3డి ఇంగ్లీష్) (1.40, 4.40, 7.40)

స్క్రీన్-3 : తుదరం (10.40)
: జింఖానా (11.25, 7.25)
: శౌర్యపారం (2.20)
: అంటిల్ డౌన్ (ఇంగ్లీష్) (5.00, 10.20)

స్క్రీన్-4 : ఏఎల్‌సీసీ (11.25)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (2.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (5.00)
: సోదర (7.35)
: సూర్యపేట జంక్షన్ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జింఖానా (11.00, 4.40, 7.40, 10.30)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (1.40)

స్క్రీన్-2 : సారంగపాణి జాతకం (10.40, 1.30, 4.30, 7.30, 10.30)

స్క్రీన్-3 : శౌర్యపరం (11.00)
: సూర్యపేట జంక్షన్ (4.40, 10.20)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (7.30)

లలితామహల్ : సారంగపాణి జాతకం (11.15, 2.15, 6.15, 9.15)

దేవి : జింఖానా (11.15, 6.15)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (2.15, 9.15)

నటరాజ్ : సూర్యపేట్ జంక్షన్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్